సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 10 । జనవరి । 2025



మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

రైతులు బొప్పాయి, అరటి, దోస తదితర పంటలను మల్చింగ్ షీట్ పద్ధతిలో పండించి ప్రయోజనాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. -IIలో



కనుగొండలో చిరుత అలజడి

ములకలచెరువు మండలం కనుగొండ అడవిలో ఒక దూడపై చిరుత పులి మరోసారి దాడి చేసి అలజడి సృష్టించింది. ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 97 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

రాయచోటి టౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేటు బస్సు యజమానులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా అధికారి కె.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రవాణా చార్జీలు ఆర్టీసీ బస్సుల చార్జీలతో సమానంగా ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు కాలపరిమితి కలిగి ఉండాలని సూచించారు. వాణిజ్య వాహనాలు కలిగిన యజమానులు జనవరిలో పన్ను చెల్లించాల్సి ఉందని తెలిపారు. గడువులోపే చెల్లించాలన్నారు.

నేడు గంగమ్మ జాతర వేలంపాట

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మ ఆలయంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు జాతర జరగనుంది. ఇందుకు సంబంధించి తలనీలాలు, కొబ్బరి కాయలు, ప్రతి ఆదివారం ఏడాదిపాటు ఆలయం ముందు కొబ్బరి కాయలు, పూలదండల విక్రయం కోసం వేలంపాటను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్థానిక గంగమ్మ దేవస్థానంలో జరిగే వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా రూ. 50 వేలు డిపాజిట్ చేయాలన్నారు. వేలంపాట దక్కని వారికి తిరిగి రూ. 50 వేలు వెనక్కు ఇవ్వనున్నట్లు చెప్పారు. దేవదాయశాఖ సిబ్బంది సమక్షంలో వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

కడపకు వరుస విజయాలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు వరుస విజయాలతో దూసుకుపోతోంది. గురువారం వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు జట్టు 34.3 ఓవర్లలో 139 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కడప బౌలర్ రుత్విక్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 26.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని తాహీర్ 57 పరుగులు చేశాడు.

వీరభద్రాలయంలో వైకుంఠ ఏకాదశి జరపడం లేదు

రాయచోటి టౌన్: రాయచోటిలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా దర్శన కార్యక్రమాలు లేదని ఆలయ ఈవో రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఏ ఆగమం ప్రకారం పూజలు జరుగుతున్నాయో వాటి ప్రకారమే పూజలు నిర్వహించాలని దేవదాయ శాఖ కమిషనర్ సూచించారని అన్నారు. పూర్వం నుంచి వీరశైవ అగమోక్తంగా పూజలు జరుగుతున్నాయన్నారు. వైకుంఠ ఏకాదశి వైష్ణవ సంప్రదాయానికి చెందినదని..అందువల్ల శుక్రవారం వైకుంఠ ఏకాదశిని వీరభద్రాలయంలో జరపడం లేదని భక్తులకు తెలియజేశారు. ఈ విషయన్ని గమనించి దేవస్థానానికి సహకరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి భక్తులను కోరారు.

విద్యుత్ బకాయిలు చెల్లించని వారి కనెక్షన్లు తొలగించాలి



లింగంపల్లెలో విద్యుత్‌లైన్‌లను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రమణ

సిద్దవటం: విద్యుత్ బకాయిలు చెల్లించకుండా ఎవరైతే ఉంటారో అలాంటి వారి విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేశామని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్. రమణ తెలిపారు. గురువారం ఆయన సిద్దవటం మండలం లోని లింగంపల్లె సబ్ స్టేషన్‌ను, సిద్దవటం లోని ట్రాన్స్‌ఫార్మర్‌లను, విద్యుత్ లైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం సిద్దవటం లోని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగ దారులకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం కింది నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సిద్దవటం మండలం లో రూ. 7.76 కోట్ల విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మొండి బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం వారి మీటర్‌ను శాశ్వతంగా తొలగించి కోర్టులో దావా వేసి చట్టరీత్యా చర్యలు తీసుకొని విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని సూచించామన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన లైన్‌మెన్ సుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యానాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ సుబ్రమణ్యం, స్థానిక ఏఇ జయచంద్ర పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులతో రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డి

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో చైర్మన్, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్, రాజ్యసభ సభ్యులు రఘునాథరెడ్డి తదితరులు

రాయచోటి: అన్నమయ్య జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేయాలని రాజంపేట పార్లమెంట్ సభ్యులు, జిల్లా అభవృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ పీవీ మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేటలోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎంపీ, చైర్మన్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట, తంబళ్లపల్లె శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల జెడ్పీ చైర్మన్లు శ్రీనివాసులు, శారదలు హాజరయ్యారు.సమావేశ ప్రారంభంలో రాజంపేట పార్లమెంట్ సభ్యులు, చైర్మన్ మిథున్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, సభ్యులకు జిల్లా అధికారులు సాదరంగా ఆహ్వానం పలికారు.

అభివృద్ధిలో రాజకీయాలు వద్దు

జిల్లా అభివృద్ధి విషయంలో రాజకీయాలు వద్దని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో జిల్లాను అభివృద్ధి చేద్దామని రాజంపేట పార్లమెంట్ సభ్యులు, చైర్మన్ పీవీ మిథున్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. జిల్లాలో మొదటిసారిగా సమావేశం నిర్వహించడం సంతోషకరమన్నారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర పథకాలు ఎలా నిర్వహిస్తున్నారన్న విషయంపై మననం చేసుకుందాం అన్నారు. పథకాల అమలుకు రావాల్సిన నిధులను ఏ విధంగా తీసుకురావాలి.. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలా ఉపయోగించాలన్నది ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, పంచాయతీరాజ్ సంస్థలు, మున్సిపల్ బాడీ, స్థానికసంస్థల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులందరి మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణమమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

సమీక్షలు: డ్వామా, పంచాయతీరాజ్, గృహ నిర్మాణం, జడ్పీకి సంబంధించి జాతీయ రూబన్ పొజిషన్, గనులు, భూగర్భం, గ్రామీణ నీటిపారుదల, వైద్య ఆరోగ్యం తదితర శాఖల వారీగా చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పథకాల అమలుపై సభ్యులు లేవనెత్తిన అంశాలకు సంబంధించి అధికారులకు చైర్మన్ పలు సూచనలు జారీ చేశారు.

సభ్యులు లేవనెత్తిన అంశాల పరిష్కారానికి చర్యలు

సభ్యులు సమావేశంలో లేవనెత్తిన అంశాలన్నిటినీ నోట్ చేసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ సమీక్షలో చెప్పారు. తంబళ్లపల్లెలో పోస్టుమార్టం, పీలేరులో 52 పడకల ఆసుపత్రిలో వైద్యులు అందుబాటు, ట్రామాకేర్ సౌకర్యం, శానిటేషన్ వర్కర్లు, 15 ఆర్థిక సంఘం నిధులకు పంచాయతీ కార్యదర్శుల సహకారం, జెడ్పీ నుంచి అనుమతులు ఇచ్చిన పనులను అమలు చేయడం, సచివాలయంలో వెండర్స్ ద్వారా బిల్లులు అప్‌లోడ్ చేయడం, నందలూరు పీహెచ్‌సీలో మహిళా వైద్యురాలి ఏర్పాటు, రాయచోటి వేంపల్లి రోడ్డు, రాజంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి, బి.కొత్తకోటలో పోస్టుమార్టం ఏర్పాటుకు ఏపీఎంఎస్ఐడీసీ నుంచి నిధులు విడుదల, రామసముద్రం మండలంలో ఆపరేషన్ కేంద్రం ఏర్పాటు తదితర అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి కేంద్రీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ వివరించారు. ఎంపీ లాడ్స్ కింద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎంపీలు ప్రతిపాదించిన అత్యవసర పనులకు సంబంధించి పది రోజుల్లోగా డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని పరిపాలన అనుమతులు పొందేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సీపీఓకు కలెక్టర్ సూచించారు. వీరబల్లిలో లైనింగ్ ఏరియా, నిమ్మనపల్లిలో పెన్షన్ల సమస్య వీటన్నిటి పరిష్కారానికి కూడా సంబంధిత అధికారులు బాధ్యత వహించేలా సూచనలు జారీ చేస్తామన్నారు. సమావేశంలో చర్చించిన ప్రతి అంశానికి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అంతకు ముందుగా జిల్లాలో అమలవుతున్న పథకాల గురించి జెడ్పీ సీఈఓ ఓబులమ్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు, జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల డబ్బులు దళారుల పాలు కారాదు

గృహ నిర్మాణం బిల్లుల విషయంలో దళారులకు అందకుండా చర్యలు తీసుకోవాలని తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అధికారులను కోరారు. గృహ నిర్మాణానికి సంబంధించి 90 మ్యాన్డేస్ నిధులు మధ్యలో దళారులు కాజేస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. అలాగే ఉపాధి హామీ పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు.

తీర్మానం మేరకు పనులు చేపట్టాలి

మండలాలు, గ్రామాల్లో పంచాయతీ మున్సిపల్ మండల తీర్మానం మేరకు పనులు చేపట్టాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. ప్రభుత్వాసుపత్రిలో రాత్రివేళల్లో వైద్యులు, నర్సులు విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పనుల వివరాలను ప్రజాప్రతినిధులకు అందించాలి

గ్రామసభల్లో ప్రతిపాదించిన సీసీ రోడ్లు, కాలువ నిర్మాణాలకు సంబంధించి ఎక్కడెక్కడ పనులు చేపడుతున్నారో వాటి వివరాలను ప్రజాప్రతినిధులకు అందించాలని చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు.

ఎంపీ నిధుల అభివృద్ధికి సహకరించాలి

పార్లమెంట్ నిధుల నుంచి చేపట్టనున్న అభివృద్ధి పనులకు అధికారులు సకాలంలో సహకరించాలని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులను ప్రతిపాదించినపుడు అవసరమైన అనుమతులను సత్వరం పొందేలా అధికారులు కృషి చేయాలన్నారు.

చర్చించిన ప్రతి అంశానికి పరిష్కారం చూపాలి

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో చర్చించిన ప్రతి అంశంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీ పేర్కొన్నారు. ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఉపయోగపడే పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా శాఖల్లో వివిధ పథకాలకు సంబంధించి విడుదల చేసిన కేంద్రం నిధులు పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఎన్‌హెచ్ రోడ్లు రాజంపేట పార్లమెంట్ అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్నాయన్నారు. అలాగే జల్‌జీవన్ మిషన్‌లో 15 శాతం ఎస్సీలకు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. ఎంపీ ల్యాడ్స్ పనులకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు కూడా కేంద్రం కేబినెట్లో చేర్చడం జరిగిందన్నారు. వాటర్‌షెడ్ పనులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు.



జిల్లా అభివృద్ధి పర్యవేక్షణ సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం



అన్నమాచార్య యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, నటుడు బ్రహ్మానందం, యువనటుడు కిరణ్ అబ్బవరం, చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి, ప్రోచాన్స్‌లర్ అభిషేక్‌రెడ్డి

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- అన్నమయ్య యూనివర్సిటీ ప్రారంభం

రాజంపేట: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం రాత్రి అన్నమయ్య జిల్లా రాజంపేటలోని అన్నమాచార్య యూనివర్సిటీని ప్రారంభించారు. జ్యోతి ప్రజల్వన చేసిన అనంతరతం సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నిరుద్యోగం, పేదరిక నిర్మూలన కావాలంటే విద్యనే దానికి గొప్పటానిక్ అన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అన్నమాచార్య యూనివర్సిటీ నిర్వహించడం స్వాగతించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగం, పేదరిక నిర్మూలనకు విద్య ఒక ఆయుధంగా చేసుకొని ఉద్యోగాన్వేషణ కాకుండా ఉద్యోగ కల్పనవైపు యువత ముందుకెళ్లాలన్నారు. దేశ ప్రధాని మంత్రి నరేంద్రమోదీ 2020లో నూతన విద్యావిధానం తీసుకొచ్చారన్నారు. భారతదేశ చరిత్రలో నూతన విద్యావిధానం గేమ్ చేంజర్ లాంటిందన్నారు. ప్రపంచంలో 2030లో 3కోట్ల ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. రెండు కోట్ల మంది భారతీయులు ఉద్యోగం సాధించగలగతారని నమ్మకం ఉందన్నారు.మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో అన్నమాచార్య విశ్వవిద్యాలయం నెలకొల్పినందుకు చాన్స్‌లర్ చొప్పాగంగిరెడ్డి అభినందించారు.

అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు తీసుకెళ్లే వారధులు గురువులు

అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు తీసుకెళ్లే వారధులు గురువులని ప్రముఖ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందం అన్నారు. గురువు విద్యార్థికి మార్గదర్శకుడన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో ఉన్నతశిఖరాలను అధిరోహించాలని గురువులు కోరుకుంటారన్నారు. ప్రయత్నం చేస్తూ ఉండాలని, వెనకడుగు వేయరాదన్నారు. ఇందుకు తానే ఉదాహరణ అన్నారు. ప్రపంచంలో అన్నమాచార్య యూనివర్సిటీని మేటి సంస్థగా మార్చాలని అభిప్రాయపడ్డారు. మరో సినీనటుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో కూడా ఎదో ఒక టాలెంట్ ఉంటుందని, దానిని వెలికితీసినప్పుడు, ఉన్నతస్థాయికి చేరుగోలరన్నారు. తను విద్యను అభ్యసించిన కళాశాల విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందిందింటే తనకెంతో గర్వంగా ఉందన్నారు. అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారం, కృషితో తాను అన్నమాచార్య యూనివర్సిటీ స్థాయికి తీసుకురాగలిగామన్నారు.

దత్తాత్రేయ, బ్రహ్మానందం, కిరణ్‌లకు అన్నమయ్య పురస్కారాలు

అన్నమాచార్య యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన గవర్నర్ బండారు దత్తాత్రేయ, హాస్యనటుడు బ్రహ్మానందం, నటుడు కిరణ్ అబ్బవరంలను ఏయూ తరఫున చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి, ప్రోచాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి సన్మానించి, అన్నమయ్య పురస్కారాలను అందజేశారు. ఏఐటీఎస్‌లో సుదీర్ఘకాలం సేవలందించిన రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, శివారామిరెడ్డి, పద్మలలిత, రంగనాథం, రామసుబ్బారెడ్డి, సుబ్బరెడ్డిలను లాంగ్‌సర్వీస్ అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ సీ.రామచంద్రారెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, సబ్‌కలెక్టర్ వైభోమానైదియాదేవి, రజోత్సవ వేడుకల కన్వీనరు డా.జయరామిరెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా.సుబ్బారావు, తిరుపతి మాజీఎమ్మెల్యే సోదరుడు భూమనశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో క్రీడాకారిణుల ప్రతిభ




చదరంగంలో రాణించిన జిల్లా క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్: చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన చెన్నై ఇంటర్నేషనల్ క్లాసికల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో తేజోమయి, అమీనా, లాస్యశ్రీ దీపిక రాణించారు. బాలుర విభాగంలో రేటెడ్ క్రీడాకారుడు అనురాగ్, ప్రేమ్‌దీప్‌లు సైతం చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నారని జిల్లా చదరంగం కార్యదర్శి అనీస్ దర్బారీ పేర్కొన్నారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం



రంగు రంగుల పుష్పాలంకరణలో బాలాలయం



భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాస్వామి దేవాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి ని పురస్కరించుకుని టీటీడీ వారు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లను రామాలయ అంకణాలలో నుంచి వైకుంఠ ద్వారానికి చేరుకునే విధంగా ఏర్పాటు చేశారు. అంకాణాలకు రంగురంగుల విద్యుత్ దీపాలను అమర్చారు.రామాలయం ఎదురుగా ఉన్న నందన వనంలో వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించే విధంగా సౌకర్యాలు సిద్ధం చేశారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం

రామాలయం వద్ద కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేశామని వైకుంఠ ఏకాదశి ప్రత్యేక భద్రతా అధికారి జమ్మలమడుగు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రామాలయంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. వీఐపీల ఎంట్రీపై ఆరా తీశారు. భక్తులు క్యూలైన్ల వద్ద ఇబ్బంది పడకుండా స్పెషల్ పార్టీలను కూడా నియమిస్తామని తెలిపారు. రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి, ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్, టీటీడీ విజిలెన్స్ ఏఎస్ఐ గంగులయ్య పాల్గొన్నారు.

శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో..

నందలూరు: నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశికి ముస్తాబైంది. తూర్పు ద్వారం నుంచి 7 వైకుంఠ ద్వారాలతో స్వామివారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.భక్తులకు ఇబ్బందులు తల్తెకుండా చర్యలు చేపట్టినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

అప్పుడూ.. అంతే!

- 2018లో కోదండ రాముని కల్యాణ వేడుకల్లో అపశృతి
- బాబు సర్కార్‌లోని టీటీడీ లోపభూయిష్ట ఏర్పాట్లతో కూలిన షెడ్లు
- అప్పట్లో నలుగురు మృతి.... 70 మందికి గాయాలు
- ప్రస్తుతం తిరుపతి ఘటన నేపథ్యంలో ఒంటిమిట్టపై చర్చ



ఒంటిమిట్ట ఆలయం వద్ద గాలి వానకు పడిపోయిన టెంట్లు, ఇతర కట్టణాలు (ఫైల్)

సాక్షి రాయచోటి: సర్వం సిద్ధం.. వైభవంగా మరి కొన్ని గంటల్లో శ్రీ కోదండరామస్వామి కల్యాణం జరుగుతుందనుకున్న క్షణంలో.. ఆకాశంలో మబ్బులు కమ్మడం..ఉరుములు, మెరుపులు.. గాలులతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అంతలోనే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ నుంచి కడపలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకోవడం..ఇక బయలుదేరుతారనుకున్న లోపే ప్రకృతి బీభత్సం సృష్టించింది. ఒంటిమిట్టలో ప్రకృతి సృష్టించిన విలయానికి భక్తులు నిశ్చేష్టులయ్యారు. పిడుగులతో భారీ వర్షం కురుస్తుండగా...స్తంభాలు కూలిపోయి...టీటీడీ ఏర్పాటు చేసిన తాత్కాలిక టెంట్లు లేచిపోయాయి.షెడ్లు, ఇతర కల్యాణ మండప ఆవరణలో ఏర్పాటు చేసిన నిర్మాణాలు కూలిపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో సాయంత్రం 5.30 నుంచి 8.00 గంటల వరకు చీమ్మచీకట్లు అలుముకున్నాయి. అందరూ తేరుకునే లోపే విషాదం బయటపడింది. కూలిపోయిన షెడ్లు, టెంట్లు, స్తంభాల కింద సుమారు నలుగురైదుగురు మృత్యువాత పడటం, మరో 70 మందికి పైగా గాయపడటం జరిగిపోయాయి. ప్రస్తుతం తిరుమల-తిరుపతి దేవస్థానానికి సంబంధించి వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో టోకన్ల పంపిణీలోజరిగిన అపశృతి వ్యవహారం నేపథ్యంలో మరొకమారు ఒంటిమిట్టలో 2018 మార్చి 30న కల్యాణం సందర్భంగా చోటుచేసుకున్న ఘటనపై చర్చించుకుంటున్నారు.

చరిత్రలో తొలిసారి

ఏకశిలానగరంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ బ్రహ్మోత్సవాల సమయంలో పండువెన్నెల్లో నిర్వహించడం ఆనవాయితీ. 2014 రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్టను అధికారిక క్షేత్రంగా గుర్తించి...తెలంగాణలోని భద్రాద్రి తరహాలో అధికారిక లాంఛనాలతో రాష్ట్ర ప్రభుత్వం శ్రీరామ నవమి వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ తరుణంలో ఒంటిమిట్టను టీటీడీలోకి విలీనం చేసి...సుమారు రూ. 100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే స్వామి వారి కల్యాణ వేదిక వద్ద శాశ్వత నిర్మాణాలు అప్పట్లో లేకపోవడంతో తాత్కాలిక చలువ పందిళ్లను మొదలుకొని ఇతర ఏర్పాట్లుచేశారు. అనుకోకుండా వచ్చిన గాలి, వర్షం బీభత్సం ధాటికి ఎక్కడికక్కడ కూలిపోవడం..మనుషులు మృతి చెందడం..గాయపడటం ఇప్పటివరకు ఒంటిమిట్ట చరిత్రలో ఎప్పుడూ చోటుచేసుకోలేదు. ఇది తొలిసారిగా చరిత్రలో విషాద ఘటనగా నిలిచిపోయింది.

నరసాపురంలో ఆందోళన

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురంలో ఆందోళన కొనసాగింది. నరసాపురంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 360 మందికి పైగా వెంకటేశ్వరస్వామి భక్తులు కాలినడకన తిరుపతికి వెళ్లారు. అక్కడ వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం వీరంతా ప్రయత్నం చేసే క్రమంలో పలువురు గాయపడ్డారు. 9-10 మంది వరకు గాయపడగా, మిగిలిన అందరి ఆచూకీ తెలియాల్సి ఉంది. ఇప్పటికే గ్రామస్తులతోపాటు వెళ్లిన వారు ఒకరినొకరు ఫోన్లు చేసుకుని అందరూ కలుసుకుంటున్నారు. అయితే ఇంకా గ్రామంలో వెళ్లిన వారి గురించి టెన్షన్ వెంటాడుతోంది. ఏది ఏమైనా తిరుపతి సంఘటన గ్రామంలో ఆందోళన నెలకొనేలా చేసింది.

మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

- కలుపు నివారించవచ్చు
- వేరు వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది
- మల్చింగ్‌కు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే ప్రయోజనకరం

రైల్వేకోడూరు అర్బన్ : రైతులు పంట సాగు చేసిన ప్రతి సారి అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు బొప్పాయి, అరటి, కూరగాయలు, దోస, కర్బూజ, మిరప, పూలసాగు తదితర పంటలను మల్చింగ్ షీట్ పద్ధతిలో పండించి బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో డ్రిప్ నీటి పారుదల ఉండడం వల్ల ఎక్కువ వర్షాలు వచ్చినా, తక్కువ వర్షాలు వచ్చినా మొక్కల పెరుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కొంతమంది రైతులు మల్చింగ్ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే వారు మంచి దిగుబడులు, అధిక రాబడి పొందుతారు.

మల్చింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు..


దోస, బొప్పాయి పంటలకు అమర్చిన మల్చింగ్ షీట్

చిన్న పంటలను కూడా మల్చింగ్ ద్వారా పండిస్తే వర్షాభావ పరిస్థితులలో నీటిని ఆదా చేసుకోవచ్చు. మల్చింగ్ కింద డ్రిప్ పైపు ఉండడం వల్ల మొక్కకు నీరు సమృద్ధిగా అందుతుంది. చెట్టుకింద భూమి పొడిగా ఉండి వేరు వ్యవస్థ ఆరోగ్యంగా పెరుగుతుంది. కలుపును నివారించవచ్చు. డ్రిప్ ద్వారా వేసిన ఎరువులు మొక్కలకు బాగా అందుతాయి. మల్చింగ్ షీట్‌పై పంటలు పండిస్తే భారీ వర్షాలు పడినా తెగుళ్లు తక్కువగా వస్తాయి. పంట నాణ్యతతో పాటు దిగుబడి పెరుగుతుంది.

జిల్లాలో మల్చింగ్ షీట్‌పై పండించే పంటలు (ఎకరాలు)					
నియోజకవర్గం	దోస	బొప్పాయి	కర్బూజ	అరటి	టమాటా
కోడూరు	2210	3109	1720	3516	-
రాయచోటి	480	2030	346	58	-
రాజంపేట	179	445	225	1467	-
మదనపల్లె	125	109	56	14	3240
పీలేరు	230	429	42	28	4117
తంబళ్లపల్లి	708	380	-	-	9044

కొత్త ప్రభుత్వంలో సబ్సిడీలకు మంగళం..

ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీలకు నిధులు కేటాయించకుండా.. పథకాలకు మంగళం పాడడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో రైతులు ఎక్కువగా దోస, కర్బూజ, బొప్పాయి, అరటి పంటలను మల్చింగ్ షీట్‌లపై పండించేందుకు ఆసక్తి చూపుతారు. అయితే ప్రభుత్వ సబ్సిడీలు రైతులకు అందుబాటులో లేవు. జిల్లాలోని 6 నియోజకవర్గాల్లో రైతులు ఎక్కువ శాతం దోస, కర్బూజ పంటలు మల్చింగ్ షీట్‌పై వేసి బొప్పాయి, అరటి కూడా సాగు చేస్తారు. ఇలా జిల్లాలో వేలాది ఎకరాలలో రైతులు పంటలు పండిస్తుంటారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల రైతులకు అన్ని రకాల సబ్సిడీలు అందించేవారు. అందులో భాగంగానే మల్చింగ్ షీట్‌కు కూడా రైతులకు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించారు. కానీ ఇప్పటి కూటమి ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

కలుపు నివారణ కోసమే



గత కొంత కాలంగా మల్చింగ్ షీట్ ద్వారా దోస, కర్బూజతో పాటు అరటి, బొప్పాయి పంటలు పండిస్తున్నాము. ఈ ఏడాది దోసతో పాటు రెండవ పంటగా బొప్పాయి వేశాను. మల్చింగ్ షీట్ వల్ల ముఖ్యంగా కలుపు బెడద ఉండదు. దీనివల్ల కూలీల భారం తగ్గుతుంది. పెట్టుబడి తగ్గుతుంది.

- ప్రతాప్‌రెడ్డి, ఆదర్శ రైతు, ఓ. కొత్తపల్లి, రైల్వేకోడూరు

పంట దిగుబడి బాగా వస్తుంది



గత కొంత కాలంగా మల్చింగ్ షీట్ ద్వారా టమాటా ఎకరా పొలంలో పండిస్తున్నాను. రెండు పంటలకు మల్చింగ్ షీట్ వల్ల ఉపయోగం ఉంది. ముఖ్యంగా తెగుళ్ల బెడద తక్కువగా ఉండి దిగుబడి బాగా వస్తుంది.

- సి.భాస్కర్‌రెడ్డి, గంగాపురం నిమ్మనపల్లి, మదనపల్లె మండలం

వర్షాల వల్ల ఇబ్బంది ఉండదు



మల్చింగ్ షీట్‌పై ఏ పంట పండించినా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడినా, నీరు తక్కువగా ఉన్నా పంటలకు ఇబ్బంది ఇబ్బంది ఉండదు. పంట చిన్న వయసులో ఉన్నా అధిక వర్షం ప్రభావం వల్ల వేరుకు తెగుళ్లు రాకుండా కాపాడుకోవచ్చు.

- అనిల్ రెడ్డి, రాఘవరాజపురం, రైల్వేకోడూరు

మల్చింగ్ పద్ధతితో రైతుకు ప్రయోజనం



గత కొంత కాలంగా మల్చింగ్ షీట్ ద్వారా దోస, కర్బూజ, టమాటా వంటి పంటలు సాగు చేస్తే అధిక ప్రయోజనం పొందవచ్చు. ఈ పద్ధతి వల్ల రైతులకు అన్ని పంటలలో వేరు వ్యవస్థ బాగా ఉండి, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి, తక్కువ నీటి వాడకం, కలుపు నివారణ వల్ల రైతులకు ఇలా అనేక ప్రయోజనాలు ఉంటాయి.

-రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

రైళ్ల హాల్టింగ్స్‌పై పునరాలోచించాలి

రాజంపేట : రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె రైల్వే స్టేషన్లలో వివిధ రైళ్ల హాల్టింగ్స్‌పై పునరాలోచించాలని గుంతకల్ డివిజినల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి గుంతకల్ డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తాను కోరారు. డీఆర్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన తొలిసారిగా చంద్రశేఖర్ గుప్తా తిరుపతికి ప్రత్యేక రైలులో వెళుతూ రాజంపేటకు చేరుకున్న సందర్భంగా డీఆర్‌ఎంతో ఆయన భేటీ అయ్యారు. ఈ ప్రాంత ప్రయాణికుల సమస్యలపై వినతిపత్రం అందించారు.

స్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలించిన డీఆర్‌ఎం

రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను గుంతకల్ డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పరిశీలించారు. ప్రత్యేక రైలులో చేరుకున్న ఆయనకు స్టేషన్ మేనేజర్ గోపీనాథ్ స్వాగతం పలికారు.

భూమి ఆక్రమించారంటూ నిరసన

టాస్క్‌ఫోర్స్ : చిన్నమండెం మండల పరిధిలోని చాకిబండ గ్రామం కుమ్మరపల్లెలో ఉన్న 435/3ఏ సర్వే నెంబర్‌లోని భూమిని అమరనాథరెడ్డి అనే వ్యక్తి ఆక్రమించాడంటూ గ్రామస్తులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఇంటి వద్ద, తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తుల కథనం మేరకు కుమ్మరపల్లెలో ఉన్న 435/3ఏ సర్వే నంబర్‌లో కొంత భూమి ఇడగొట్టు జంగమయ్య, ఇడగొట్టు రాజన్న, ఇడగొట్టు మంగమ్మ పేరు మీదుగా ఉండగా మిగతా భూమిని దిబ్బలు, గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరి భూములకు పోయేందుకు దారి సౌకర్యం ఉందన్నారు. కానీ కుమ్మరపల్లెకు చెందిన అమరనాథరెడ్డి సోదరులు ఈ నెల 8వ తేదీన తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేయించి ఈ నెల 9వ తేదీన జేసీబీ సాయంతో అక్కడ ఉన్న పురాతన కోనేరు(బావి) చదును చేయించి ఆక్రమించుకునేందుకు వచ్చారని వారు తెలిపారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం


గ్రామస్తులకు నగదు అందజేస్తున్న నాయకులు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లె పంచాయతీ దేవరబురుజులో నూతనంగా నిర్మిస్తున్న గ్రామదేవత గంగమ్మ ఆలయానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి రూ. లక్ష విరాళంగా అందజేశారు. గురువారం నగదును సర్పంచ్ విజయలక్ష్మి, రఘు, ఆర్‌ఎంపీ రమణారెడ్డి, కిషోర్‌రెడ్డిలు గ్రామస్తులు శ్రీరాములు రెడ్డి, వెంకటరెడ్డి, ఎర్రమరెడ్డి, సుబ్బారెడ్డిలకు అందజేశారు. ఎమ్మెల్యే దాతృత్వాన్ని గ్రామస్తులు అభినందించారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్‌ను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ క్రీడా ఉల్లాసాన్ని కలిగివుండాలని కోరారు. నిర్వాహకులు మాట్లాడుతూ టోర్నమెంట్ ఫైనల్‌లో గెలుపొందిన జట్టుకు రూ. రూ. లక్ష, రన్నర్స్‌కు రూ. 50 వేల నగదు బహుమతి అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల జట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

వేలం పాట వాయిదా

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై మహాశివరాత్రి సందర్భంగా తలనీలాల సేకరణ, టోల్‌గేట్, పూజా సామగ్రి అమ్మకాల షాపుల నిర్వహణ, ఆలయాల్లో పూజల నిర్వహణ వేలంపాటలు గురువారం వాయిదా వేసినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ తెలిపారు. వేలంపాటల నిర్వహణ కోసం మల్లయ్యకొండకు చేరుకున్న ఈఓ మునిరాజ వేలంపాట నిర్వహించేందుకు ప్రయత్నించగా, కూటమి నాయకులు గత ఏడాది ఆలయానికి వచ్చిన ఆదాయం, ఖర్చులు తదితర అంశాలు బహిర్గతం చేసిన తర్వాతే వేలంపాట నిర్వహించాలని పట్టుపట్టారు. దీంతో వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు శశికుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలతో తల్లీబిడ్డ క్షేమం

పీలేరు రూరల్ : క్రమం తప్పకుండా గర్భిణులు పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని డాక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని రేగళ్లు పీహెచ్‌సీలో పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమం నిర్వహించి గర్భిణులకు పరీక్షలు చేసి, సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు సూచించిన రక్త పరీక్షలు చేపించుకుని, ఆస్పత్రిలో ప్రవసం ద్వారా తల్లీబిడ్డకు పూర్తి రక్షణ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ జయలక్ష్మీ, సూపర్‌వైజర్ రజీమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆకుల వీధిలో క్షుద్రపూజల కలకలం

రాజంపేట : పట్టణంలోని ఆకుల వీధిలో గురువారం క్షుద్రపూజలు కలకలం రేపాయి. అన్నమరాజు సుబ్బరాయుడు టిఫెన్ సెంటర్‌లో గాజుపెంకులు, అక్షింతలు, నిమ్మకాయలు, పసుపు, టెంకాయ, కుంకుమతో క్షుద్రపూజలు చేసినట్లుగా స్థానికులు గుర్తించారు. ఈ పూజలు ఎవరు చేశారనేది అంతుపట్టడం లేదు.

యథేచ్ఛగా ఇసుక దందా

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గొల్లపల్లి క్వారీకి చెందిన కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుక దందా చేస్తున్నారు. తమకు కేటాయించిన రీచ్‌లో కాకుండా జంగాలపల్లి పెన్నానదిలో ఇసుకను తరలిస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా ఏకంగా ఇటాచీలనే పెన్నానదిలోకి తీసుకెళ్లి జల వనరులను తోడేస్తున్నారు. గురువారం ఈ దందా బయట పడింది. ఏకంగా పెన్నానదిలోకి ఇటాచీలు తీసుకెళ్లి ఇసుకను ట్రాక్టర్‌కి లోడు చేస్తుండగా కొంతమంది జీపీఎస్ ఫొటో తీయడంతో జీపీఎస్ లోకేషన్‌లో జంగాలపల్లి ప్రాంతాన్ని చూపించింది. దీనిపై సిద్దవటం తహసీల్దార్ మాధవీలతను వివరణ కోరగా గొల్లపల్లి క్వారీ వారికి జంగాలపల్లి వద్ద నుంచి మార్గానికి జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చారని, కాని జంగాలపల్లికి క్వారీ అనుమతులు లేవని తెలిపారు.

తిరుపతి తొక్కిసలాట ఘటన దురదృష్టకరం

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి



రాయచోటి : తిరుపతి తొక్కిసలాట ఘటన చాలా దురదృష్టకరమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆయన తిరుపతి సంఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. టోకెన్ల పంపిణీలో చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి సమస్య ఉత్పన్నమయ్యేది కాదన్నారు. గతంలో ఎక్కడిక్కడ టోకన్లు జారీ చేసే పరిస్థితి ఉండేదన్నారు. ఇరుకైన ప్రాంతంలో టోకన్లు జారీ చేయడం వల్లే ప్రజలందరూ ఒక్కసారిగా వెళ్లి తొక్కిసలాట జరిగిందన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు మెరుగైన పరిహారం ఇవ్వాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత టీటీడీ అధికారులు, పాలకులపై ఉందని పేర్కొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట


పోలీసు స్టేషన్‌లో ప్రేమ జంట

సిద్దవటం : మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాలకు చెందిన మనోహర్, కళాశ్రీ ప్రేమ జంట గురువారం సిద్దవటం పోలీసులను ఆశ్రయించారు. వీరు గత మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. లింగంపల్లెకు చెందిన మనోహర్, కడపాయపల్లెకు చెందిన కళాశ్రీల కులాలు వేరు కావడంతో వీరి వివాహానికి కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. దీంతో సిద్దవటం మండలం కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న శ్రీ ఉమాదేవి సహిత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో గురువారం వారు వివాహం చేసుకున్నారు. మనోహర్ కడప ఎయిర్‌పోర్ట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, కళాశ్రీ కడప నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వివాహం చేసుకున్న అనంతరం వారు సిద్దవటం పోలీసులను ఆశ్రయించడంతో ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర ఇరువురి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. మనోహర్ కుటుంబ సభ్యులు వివాహాన్ని అంగీకరించి వారి స్వగృహానికి తీసుకెళ్లారు. కళాశ్రీ కుటుంబీకులు అంగీకరించక పోవడంతో వారి దగ్గర రాత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కనుగొండలో మరోసారి చిరుత అలజడి

ములకలచెరువు : స్థానిక కనుగొండ అడవిలో ఒక దూడపై చిరుత పులి మరోసారి దాడి చేసి అలజడి సృష్టించింది. ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికుల కథనం మేరకు వివరాలు... పాత ములకలచెరువుకు చెందిన హరికుమార్ అనే రైతు ఆవులు మేత కోసం కనుగొండ అడవిలోకి వెళ్లాయి. సాయంత్రం ఇంటికి తిరుగు ప్రయాణమైన సమయంలో ఒక దూడపైన పులి దాడి చేసి చంపేసింది. తాను పులిని ప్రత్యక్షంగా చూశానని రైతు తెలిపాడు. పులి భయంతో ఆవులను సైతం అడవిలోనే వదిలేసి ఇంటికి వెళ్లిపోయానన్నాడు. గురువారం సమాచారం అందుకున్న అటవీశాఖ సెక్షన్ అధికారి షబీన్ సంఘటన స్థలానికి చేరుకొని దూడను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇది నక్కల పని అయి ఉండవచ్చన్నారు. సాధారణంగా పులులు జంతువు మెడ లేదా గొంతు భాగంపైన దాడి చేస్తాయన్నారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

బి.కొత్తకోట : తిరుమల దర్శనం కోసం ఇంటికి తాళం వేసి వెళ్లగా దొంగలు పడిన ఘటన బి.కొత్తకోట కరెంట్ కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఇంటిని పరిశీలించారు. ఆధారాలను సేకరించారు. ఎస్‌వీ ప్రసాద్ కుటుంబంతో కలిసి తిరుమల వెళ్లారు. రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటిలోని రూ.10వేల నగదు, 37 గ్రాముల బంగారం చోరీ చేసుకుని వెళ్లారు. గురువారం ఈ విషయం గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తిరుపతి ఘటనకు చంద్రబాబు, పవన్‌లే బాధ్యత వహించాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయని, తిరుమల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇలాంటి దుర్ఘటన జరగడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఆరుగురి మరణానికి కారణమైందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టేందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు చూస్తున్నారని తెలిపారు. ఈ ఘటనకు వారిద్దరే బాధ్యత వహించాలన్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామి మీద రాజకీయాలు చేయడం చంద్రబాబుకే చెల్లిందని, ఆ పాపమే నేడు వెంటాడిందన్నారు. మృత్యువాతపడిన ప్రతి ఒక్కరికీ రూ. 1 కోటి పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు తన స్వార్థ రాజకీయం కోసం మనుషులనైనా, దేవుళ్లనైనా వాడుకుంటారన్నారు. ధర్మం గురించి, హిందూ సంప్రదాయం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ నేడు ప్రభుత్వాన్ని వెనకేసుకొస్తూ అధికారులను బాధ్యులను చేసేందుకు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తక్షణం ఇరువురూ రాజీనామా చేయాలని ఆయన పేర్కొన్నారు. అలాగే టీటీడీ పాలక మండలిని బర్తరఫ్ చేయాలన్నారు.

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ములకలచెరువు : వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు క్రిష్ణమూర్తి కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ వ్యత్యాసాలు తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. గత 70 ఏళ్లుగా ఈ పోరాటం సాగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

నిమ్మనపల్లె : భూముల రీ– సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ధనుంజయులు సూచించారు. గురువారం మండలంలోని రాచవేటి వారిపల్లె పంచాయతీ దిగువ మాచిరెడ్డిగారిపల్లెలో భూముల రీ –సర్వే కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ సర్వే పర్యవేక్షణాధికారి పల్ల ప్రసాద్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే, తప్పులు లేకుండా చేపట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తిరుపతి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి

మదనపల్లె: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఉచిత టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తోపులాటలో ఆరుగురు శ్రీవారి భక్తులు మరణించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని వాల్మీకిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు అన్నారు. తిరుపతి ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గురువారం మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఎదుట వాల్మీకిసంఘం సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పులిశ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ తిరుపతి ఘటనలో మరణించిన కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహిస్తూ టీటీడీ ఈఓను సస్పెండ్ చేయాలన్నారు. సద్దలజయసింహ, భగీరదేవా, ముక్కలజగదీష్, పొరపట్ల నరసింహులు, లక్ష్మీనారాయణ, కోనె రమణప్ప పాల్గొన్నారు.

నరసాపురం భక్తులకు తీవ్ర గాయాలు

రామసముద్రం: తిరుపతిలో బుధవారం రాత్రి జరిగిన శ్రీవారి భక్తుల దర్శన టికెట్ల తోపులాటలో నరసాపురం గ్రామానికి చెందిన శ్రీవారి భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతిలో దర్శనం టికెట్ల కోసం వేల మంది భక్తులు ఒక్కసారిగా తోపులాడుకుంటూ క్యూ లైన్ లోకి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ నెల 5వ తేదీన గ్రామం నుంచి సుమారు 450మంది వరకు కాలినడకన బయలుదేరారు. ఈ నెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి రోజున స్వామివారి దర్శనం చేసుకునేందుకు వెళ్లారు. రామానాయుడు హైస్కూల్ వద్ద భక్తుల తోపులాటలో నరసాపురానికి చెందిన భక్తులు మునిరెడ్డి, సిద్ధప్ప, లక్ష్మీదేవి, నరసమ్మ, చిన్నప్పయ్య, రఘు, వెంకటేష్, బుజ్జమ్మ, గణేష్ తో పాటు మరికొంత మంది గాయపడ్డారు. గాయపడిన వారిని తిరుపతి రుయా, స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంతటి ఘోరం జరిగిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

ఒకరి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏజాస్ అలీఖాన్

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లె సమీపంలో కడప–బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఏజాస్ అలీఖాన్((30) మృతి చెందారు. వివరాలిలా.. కర్ణాటకకు చెందిన వారు కారులో రాయచోటి నుంచి బెంగళూరు వైపు వస్తుండగా గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు ద్విచక్రవాహనంలో వస్తున్న ఏజాస్ అలీఖాన్‌ను ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న రాజు, రత్నమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు, పోలీసులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సంక్రాంతి పండుగకు వచ్చి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నందలూరు : బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లిన ఆ యువకుడు సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో కలి సంబరంగా జరుపుకుందామని స్వగ్రామానికి వచ్చాడు. రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సోమేశుల వేణు, ఉమా మహేశ్వరి దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లిన కుమారుడు సోమేశుల హరికృష్ణ (28) వారం రోజుల క్రితం సంక్రాంతి పండుగకు వచ్చాడు. గురువారం సాయంత్రం ఒంటిమిట్టలోని తన మామ ఇంటికి వెళ్తూ కడప–చెన్నై జాతీయ రహదారిలోని కన్యకా చెరువు కట్టపై రెండు బైకులు ఢీ కొనడంతో హరికృష్ణ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీంతో బంధువులు, తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు.

మాజీ ఎమ్మెల్యే సంతాపం


గరుడారురెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి : పట్టణ పరిధిలోని రామ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు నారే గరుడారురెడ్డి (75) గురువారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సాయంత్రం మృతుని స్వగృహానికి చేరుకుని మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుమారుడు న్యాయవాది రాంప్రసాద్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పార్టీ కనీవ్వనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు రత్నశేఖర్‌రెడ్డి, ఎస్టీడి హరి, మధుసూదన్‌రెడ్డి, బాబురెడ్డి, రవీంద్రనాథరెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

పీలేరు : మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఇన్‌చార్జి ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మాట్లాడుతూ మీటర్ల కనెక్షన్స్‌కు ట్రాన్స్‌కో సిబ్బంది లంచాలు లేనిదే పని చేయడం లేదని ఫిర్యాదు చేశారు. అలాగే దరఖాస్తులు చేసుకున్న రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు సకాలంలో ఇవ్వాలని కోరారు. భూసమస్యలపై ఫిర్యాదులు చేశారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

బి.కొత్తకోట: వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. అత్యంత పురాతన చెన్నకేశవ ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఆలయ వైకుంఠ ద్వారం గుండా శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు సిద్ధం చేస్తున్నారు. అలాగే బీసీకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ నిర్వాహకులు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

మదనపల్లె : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం ఉత్తర ద్వార దర్శనంకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. గురువారం స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశికి చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. క్యూలైన్ల నిర్వహణ, పారిశుద్ధ్యంపై పలు సూచనలు చేశారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేసినట్లు డిప్యూటీ ఈఓ వరలక్ష్మి తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వైకుంఠద్వారం ద్వారా భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం చేయనున్నారు.



విద్యుత్‌దీపాల అలంకరణలో చెన్నకేశవస్వామి

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


బి.కొత్తకోట: జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉజ్జయిని సాంబశివ అన్నారు. మండలంలోని అమరనారాయణపురంలో గురువారం కోటావూరు, బండారువారిపల్లె, తుమ్మనంగుట్ట గ్రామాలకు చెందిన పార్టీ నేతల సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పనిచేస్తానని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బీసీలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. జెడ్పీటీసీ రామచంద్ర, విజయభాస్కర్‌రెడ్డి, రెడ్డిహరి పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

మదనపల్లె : పొన్నూరు బార్ అసోసియేషన్ సభ్యుడు బేతాళ ప్రకాష్ అనే న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ.. ది బార్ అసోసియేషన్, మదనపల్లె ఆధ్వర్యంలో రెండురోజుల పాటు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు టి.వెంకటరమణారెడ్డి, జి.బయ్యారెడ్డి తెలిపారు. ప్రకాష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కాలం రఘుపతి, జాయింట్ సెక్రటరీ జీఎస్.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ కార్యదర్శి గఫూర్ తెలిపారు. గుంటూరు జిల్లా పొన్నూరు బార్ అసోసియేషన్ న్యాయవాది ప్రకాష్‌రావును పోలీసులు మానసికంగా వేదించడం దారుణమని ఖండించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదిపైనే దాడి చేస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇందుకు నిరసనగా గురు, శుక్ర వారాలు, రెండురోజుల పాటు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

అభివృద్ధిలో అగ్రగామి మదనపల్లె



మదనపల్లె పట్టణం



మదనపల్లె టౌన్‌బ్యాంక్

- మగువలను ఆకట్టుకునే నీరుగట్టు పట్టుచీరలు
- ఎడ్యుకేషన్, మెడికల్ హబ్‌గా ప్రత్యేక గుర్తింపు
- ప్రజల అభిరుచులకు తగ్గట్లుగా వాణిజ్య దుకాణాలు

మదనపల్లె : రాయలసీమలో చారిత్రక నేపథ్యం కలిగిన పట్టణాలను గుర్తుచేసుకుంటే, అందులో తప్పనిసరిగా ఉండే పేరు మదనపల్లె. అన్నమయ్య జిల్లాలో అతి పెద్ద పట్టణంగా, విద్య, వైద్యం, వ్యాపారం, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక రంగాల పరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎడ్యుకేషన్, మెడికల్, టమాటా, సిల్క్ హబ్‌గా గుర్తింపు పొందింది. ముఖ్యంగా నీరుగట్టువారిపల్లె పట్టు చీరలు మగువల మనస్సును ఆకట్టుకుంటూ జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాయి.

కార్పొరేట్ వైద్యం

బెంగళూరు, చెన్నై, తిరుపతి తదితర పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన వైద్యసేవలు నేడు పట్టణంలోనూ అందుబాటులోకి వచ్చాయి. వైద్య రంగంలో విశేష అనుభవం గడించిన వైద్యులు పట్టణంలో అత్యాధునిక వసతులతో ఆస్పత్రులు నిర్మించి, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగా కార్పొరేట్ వైద్యసేవలు అందిస్తున్నారు.

విద్యలో ముందజ

పట్టణంలో స్టేట్, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్‌లను బోధించే పాఠశాలలు అనేకం ఉన్నాయి. పెద్ద పెద్ద కార్పొరేట్ స్కూల్స్‌తో పోటీపడుతూ క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించడంలో విజయభారతి స్కూల్ ముందంజలో ఉంటోంది. నవోదయ, సైనిక్ స్కూల్లో ప్రవేశాలకు సంబంధించి స్థానిక పేద, మధ్యతరగతి విద్యార్థులకు కోచింగ్ ఇస్తూ ప్రతి ఏడాది ఉత్తమఫలితాలు సాధించడంలో మల్లికార్జున కోచింగ్ సెంటర్ సత్తా చాటుకుంటోంది.

బ్రాండెడ్ టైల్స్ ప్రత్యేకత

భవననిర్మాణ రంగంలో గృహ యజమానుల అభిరుచులకు తగ్గట్లుగా ఆధునిక, ఆకర్షణీయ డిజైన్లతో బ్రాండెడ్ టైల్స్, క్వాలిటీ సామగ్రిని సరఫరా చేసేందుకు మీనాక్షి టైల్స్ షోరూంలు ఉన్నాయి.

విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ రంగం

మదనపల్లె పట్టణంలో రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా విస్తరిస్తోంది. పట్టణ శివారుప్రాంతాల్లో చిత్తూరు, తిరుపతి, అంగళ్లు, బెంగళూరు హైవేలకు ఆనుకుని వందల ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. అపార్ట్‌మెంట్లు, అత్యాధునిక సదుపాయాలతో కూడిన విల్లాలు, వందలాది ప్లాట్ల సముదాయంతో కూడిన గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

శతవసంతాల వేడుకకు టౌన్‌బ్యాంక్

సహకార ఉద్యమ స్ఫూర్తితో పేద, దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికసహాయం కల్పించాలనే ఉద్దేశంతో పట్టణానికి చెందిన గంగారపు పెద్దప్పరెడ్డి ఆధ్వర్యంలో 1924, జూన్, 24న ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ లిమిటెడ్‌ను స్థాపించారు. రూ.410 షేర్ ధనంతో, 30 మంది సభ్యులతో ప్రారంభమైన టౌన్‌బ్యాంక్ నేడు రూ. 150 కోట్ల టర్నోవర్ సాధించింది. టౌన్‌బ్యాంక్ చైర్మన్లుగా ఇప్పటివరకు గంగారపు పెద్దప్పరెడ్డి, సి.రామిరెడ్డి, టీఎస్.నాగిరెడ్డి, టీఎస్.విశ్వనాథరెడ్డి, టీ.ఎస్.రఘురామిరెడ్డి, ఆర్.వి.కృష్ణకుమార్, ఆర్.వి.విజయకుమార్, నాదెళ్ల విద్యాసాగర్‌లు పనిచేశారు. వీరిలో ఆర్.వి.విజయకుమార్, నాదెళ్ల విద్యాసాగర్‌లు మూడుసార్లు టౌన్‌బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికై సేవలందించారు.

అందుబాటులో ప్రత్యేక వైద్యసేవలు



వైద్యపరంగా ఈ ప్రాంతం వేగంగా వృద్ధి చెందుతోంది. గతంతో పోల్చితే అన్ని రకాల వైద్యసేవలు, ఆస్పత్రులు ఇక్కడ అందుబాటులోకి వచ్చాయి. తక్కువఖర్చుకే కార్పొరేట్ తరహాలో అత్యాధునిక వైద్య సేవలందిస్తున్నాం. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా పనిచేస్తున్నాం. – డాక్టర్.పీ.వి.ప్రకాష్ గుప్తా, శ్రీ కార్తికేయ తల్లి, పిల్లల హాస్పిటల్

బ్రాండెడ్ టైల్స్ అందుబాటులో...



వినియోగదారుల అభిరుచికి తగ్గట్లుగా బ్రాండెడ్ టైల్స్ పట్టణంలో అందుబాటులో ఉన్నాయి. వీటికోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ వాల్స్, ఫ్లోర్ టైల్స్ హోల్‌సేల్, రిటైల్ ధరలకు లభిస్తున్నాయి. – జి.రవీంద్ర, మీనాక్షిటైల్స్, చౌడేశ్వరి కల్యాణమండపం ఎదురుగా

నాణ్యమైన విద్య అందిస్తున్నాం



గతంతో పోల్చితే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. కేవలం చదువులకే పరిమితం చేయకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రోత్సహిస్తున్నాం. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే మా లక్ష్యం

–డాక్టర్ఎస్.సేతు,చైర్మన్, జయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్

మెరుగైన వైద్యసేవలు



ఆదునిక టెక్నాలజీకి అనుగుణంగా మదనపల్లెలో మెరుగైన వైద్య సేవలుఅందుబాటులోకి వచ్చాయి. ఆద్య హాస్పిటల్‌లో కిడ్నీ కేర్ సెంటర్‌లో అత్యాధునిక తులియం ఫైబర్ లేజర్, ల్యాపరోస్కోపీ(కీహల్ సర్జరీ) చికిత్సలు అందిస్తున్నాం.

– డాక్టర్ సనత్‌రెడ్డి, కిడ్నీ వైద్యులు, ఆద్య హాస్పిటల్

విదేశాలకు ఎక్స్‌పోర్ట్..



మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో హ్యాండ్లూమ్ ప్యూర్ సిల్క్ శారీస్‌ను విక్రయిస్తూ వెంకటనారాయణ సిల్క్స్ మహిళల మన్ననలు పొందింది. ఇక్కడనేయించిన చీరలు విదేశాలకు ఎక్స్‌పోర్ట్ చేస్తున్నాం.

–భోజనపు వెంకటనారాయణ, తొగటవీర క్షత్రియసంఘం అధ్యక్షులు

పసందైన వంటలు

పెళ్లి, ఫంక్షన్‌లు, శుభకార్యాలకు రకరకాల వంటలను వండటమే కాకుండా, వాటిని వడ్డించేందుకు శ్రీ సాయి మంజునాథ క్యాటరింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. కష్టకాలంలో అండగా నిలిచేందుకు ఎల్ఐసీ జీవితబీమా సంస్థ కార్యాలయం పట్టణంలో ఉంది.